సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



**సదరం తిప్పలు**
సదరం స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు శుక్రవారం రాత్రినుంచే మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాచారు.
- 9లో ▸



**దర్జాగా నొక్కేశారు**
విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల విషయంలోనూ కొందరు హెచ్‌ఎంలు చేతివాటం ప్రదర్శించారు.
- 8లో ▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
31.9 /16.8
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన పరీక్షకు 767 విద్యార్థులకు గాను 754 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 781 విద్యార్థులకుగాను 718 మంది పాల్గొన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

### 7, 9 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 7, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ఆర్థికం, ప్రణాళిక, 9న సాంఘిక, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ శాఖలపై స్థాయీ సంఘ సమావేశాలుంటాయని పేర్కొన్నారు.

**10న జెడ్పీ సర్వసభ్య సమావేశం**

జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని 10న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో సభ్యులు పాల్గొనాలని జెడ్పీ సీఈవో సాయాగౌడ్ కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులకు ఆర్థిక ప్రణాళిక తయారు, ఆమోదించడం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

### కూతురు పుట్టిన రోజే.. ప్రమాదంలో తండ్రి దుర్మరణం


హన్మండ్లు (ఫైల్)

బాన్సువాడ: కూతురు పుట్టిన రోజు కుటుంబ సభ్యులంతా కలిసి దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తాపడి తండ్రి మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సబ్బిడి హన్మండ్లు (53) తన కూతురు కృష్ణవేణి పుట్టిన రోజు వేడుకను దైవ సన్నిధిలో జరపాలనుకున్నారు. శనివారం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆటో బ్రేకులు ఫెయిల్ కావడంతో కొండ పైనుంచి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న హన్మండ్లుతో పాటు కూతురు కృష్ణవేణి, భార్య జయశ్రీ, అత్త గంగవ్వ, డ్రైవర్ దత్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అందరినీ నిజామాబాద్ తరలిస్తుండగా హన్మండ్లు మార్గమధ్యలో మృతి చెందాడు. మిగతావారు చికిత్స పొందుతున్నారు.

### స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న అన్ని కులాలు, మతాలకు చెందిన విద్యార్థులనుంచి స్కాలర్‌షిప్ కోసం సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. స్కాలర్‌షిప్ కోసం కొత్త దరఖాస్తులతోపాటు రెన్యువల్ కోసం మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జి.రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల కోసం 7న స్పెషల్ డ్రైవ్

కామారెడ్డి క్రైం: ఇజ్రాయిల్‌లో ఉద్యోగావకాశాల కోసం 7న స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలో రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇజ్రాయిల్‌లో షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్‌గా పనులకు డిమాండ్ ఉందని పేర్కొన్నారు. 21–45 ఏళ్లలోపు వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై, ఆయా రంగాలలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 7 న కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.

# సర్కారు బడుల్లో భావి శాస్త్రవేత్తలు!

సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు అద్భుతాలు చేస్తున్నారు. కొత్తకొత్త ఆవిష్కరణలతో జిల్లా, రాష్ట్ర స్థాయిలలోనే కాకుండా జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలోనూ సత్తా చాటుతున్నారు. సృజనాత్మక శక్తితో అబ్బురపరిచే పరికరాలను తయారు చేసి అందరి మన్ననలు అందుకుంటున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాకు చెందిన విద్యార్థులు రూపొందించిన 20 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ సైన్స్‌ఫెయిర్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ వంటి రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల్లో స్థానం సంపాదించుకున్నాయి. జిల్లా విద్యార్థుల ప్రతిభపై సండేస్పెషల్..

– సాక్షి, కామారెడ్డి

సండే స్పెషల్

సృజనాత్మక శక్తి ఏ ఒక్కరి సొంతమో కాదు.. వెన్నుతట్టి ప్రోత్సహించేవారుంటే ఎవరైనా అద్భుతాలు చేయగలరు. ఏ విషయంలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు సర్కారు బడి పిల్లలు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలోనూ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలో గతనెల 27 నుంచి ఈనెల 1 వ తేదీ వరకు సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన రెండు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తాము రూపొందించిన పరికరాలను ప్రదర్శించి నిర్వాహకుల అభినందనలు అందుకున్నారు. అలాగే కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ 'లర్న్ ఫిజికల్ సైన్స్ విత్ ఫన్ గేమ్స్' పేరుతో రూపొందించిన టీఎల్‌ఎం అంశాలను ప్రదర్శించి ద్వితీయ స్థానం పొందారు.


విజయవాడలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రాజెక్టు గురించి వివరిస్తున్న జిల్లా విద్యార్థులు

- అబ్బురపరిచే పరికరాలు తయారు చేస్తున్న విద్యార్థులు
- ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు
- రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో గుర్తింపు

### ఏటా పదుల సంఖ్యలో ప్రదర్శనలు



జిల్లా అధికారుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల చొరవతో సైన్స్ ఫెయిర్స్, నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్, ఇన్‌స్పైర్ వంటి వాటిలో జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలలో ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు పాల్గొంటున్నారు. గైడ్ టీచర్స్ సహకారంతో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

– సిద్దరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

### డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే కారు కదిలేది..

రాజంపేట మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సింధూజ 'డ్రైవింగ్ లైసెన్స్ బేస్డ్ ఇంజన్ ఇగ్నిషన్ సిస్టం' రూపొందించింది. ఈ పరికరాన్ని అమర్చితే.. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు డ్రైవర్ సీట్లో ఉంటేనే వాహనం కదులుతుంది. ఈ పరికరంలో డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను సేవ్ చేయాలని, ఆ తర్వాత ఆ వ్యక్తి నడిపితేనే వాహనం కదులుతుందని విద్యార్థిని సింధూజ వివరించింది. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందని, దొంగలు వాహనాన్ని చోరీ చేయలేరని పేర్కొంది. ఈ ప్రదర్శనను సైతం విజయవాడ సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించారు. గైడ్ టీచర్‌గా పాఠశాల సైన్స్ టీచర్ జి.అశోక్‌రావు వ్యవహరించారు.


ప్రాజెక్టుతో విద్యార్థి, టీచర్

### హెల్మెట్ ధరిస్తేనే బైకు స్టార్ట్..



రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి నెనావత్ బబ్లూ వినూత్నంగా ఆలోచించి పరికరాన్ని రూపొందించాడు. హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యేలా పరికరాన్ని తయారు చేశాడు. అలాగే ఆల్కహాల్ తీసుకుంటే కూడా బైక్ స్టార్ట్ అవ్వదు. సీట్ బెల్ట్ పెట్టుకుంటేనే ఫోర్ వీలర్ వాహనం స్టార్ట్ అవుతుంది. శ్రీనివాస్ అనే గైడ్ టీచర్ సహాయంతో ఇతడు రూపొందించిన 'ఇంటెలిజెంట్ హెల్మెట్ సిస్టం'ను విజయవాడ సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించాడు. ప్రదర్శన నిర్వాహకులు ఈ ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థిని అభినందించి, ప్రోత్సాహక బహుమతి అందించారు.

### పక్షులపై అధ్యయనం..

ఇటీవల ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో మందాపూర్ పాఠశాల విద్యార్థులు శ్రీనిధి, సాయి క్రిష్ పాల్గొన్నారు. పర్యావరణం, పక్షుల అధ్యయనంపై వీరి ప్రదర్శన జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది. మానవ తప్పిదాల వల్ల రోజు రోజుకు పక్షి సంపద క్షీణిస్తోందని, త్వరలోనే 236 పక్షులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని వీరు ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ పక్షి జాతులను సంరక్షించడానికి కృషి చేయాలని పిలుపునిస్తున్నారు.


ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థి శ్రీనిధి

# చిత్తశుద్ధితో పనిచేయాలి

- 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తాం
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ జితేష్ వి పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 8 న ఓటరు తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు వచ్చిన దరఖాస్తులను అన్నింటినీ ఈనెల 7వ తేదీలోగా పరిష్కరించి తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు నోడల్ అధికారులను మార్చామన్నారు. నియమితులైన వారు ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో ధరణిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారంలో పురోగతి సాధించామన్నారు. విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటిని ప్రారంభించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఏవైనా మరమతులు, నిర్వహణ ఖర్చులు ఉన్నట్లయితే నియోజకవర్గ ప్రత్యేక నిధులను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతున్న మరో రెండు గ్యారెంటీలకు సంబంధించిన అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాష్ట్ర సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ నూతన డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, మన్నె ప్రభాకర్, భుజంగం, సీపీవో రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్, పశు సంవర్ధక శాఖాధికారి సింహారావు, మత్స్య శాఖ ఏడీ వరదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేకాధికారులను నియమించాం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. శనివారం ములుగు కలెక్టరేట్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి అధికారులు, కలెక్టర్లతో గ్రామపంచాయతీల అభివృద్ధిపై సమీక్షించారు. వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లకు సూచించారు. ఈనెల 7 నుంచి 14 వరకు పారిశుధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తాగు నీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డుల నిర్వహణ, వైకుంఠధామాల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, డీఆర్‌డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ మురళి, మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను శనివారం ఎంపిక చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్ అండర్–8, 10, 12, 14 బాలబాలికల విభాగాలలో నిర్వహించిన పోటీలకు భారీ స్పందన వచ్చిందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. వివిధ అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపికలు నిర్వహించి 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వీరు ఈనెల 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరేష్‌రెడ్డి, వెంకటేశ్వరగౌడ్, వెంకటి, దత్తాద్రి, నవీన్, శ్రీనివాస్, మధుసూదన్, వీణ, గౌమతి, సంజీవ్, శివాగౌడ్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు..**

తాన్‌సింగ్, సీహెచ్.సాత్విక్, పి.అరాధ్య, ఎస్.కృతిక, జె.అధ్య, ఎం.రాంచరణ్, ఎ.భార్గవ్‌రెడ్డి, జె.రఘువీర్‌గౌడ్, డి.వీహన్‌రెడ్డి, బి.వేదశ్రీ, బి.రైనా, ఎస్.సాత్విక్, కె.రాంచరణ్, బి.శ్రావణ్‌కుమార్, కె.భవాని, కె.మమత, ఎం.పవిత్ర, జి.ప్రణీత, జె.ప్రవీణ్, బి.విజయ్‌కుమార్, ఎల్.యోగి, కె.సునీత, డి.సంధ్య, వి.కార్తీక్.

# వీగిపోయిన అవిశ్వాసం!

- అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్
- నెల రోజుల అనంతరం వీడిన ఉత్కంఠ


వినీత, మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్: నెల రోజులుగా చోటుచేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో.. ఎట్టకేలకు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. పండిత్ వినీతపై సొంత పార్టీ అయిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తిరుబాటు బావుటా ఎగరవేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు కలెక్టర్ జనవరి 4న అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిసెంబర్ 29న ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆర్మూర్ మున్సిపాలిటీలో నమోదు చేయించుకున్నారు. అయితే ఈయనకు ఓటు హక్కు విషయంలో అధికారులు స్పష్టతనివ్వలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం సమావేశంలో 24 మంది కౌన్సిలర్లు తీర్మానానికి అనుకూలంగా చేతులు ఎత్తగా, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాత్రం చేతు ఎత్తలేదు. కాగా 24 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లేనని అధికారులు ప్రకటించారు. అయితే మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే ఓటుతో కలిపి 37 ఓట్లు ఉండగా 2/3 కోరం అంటే 25 మంది ఓటర్లు చేతులు లేపి మద్దతు తెలిపినప్పుడే అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు అవుతుంది. ఈ సాంకేతిక అంశం ఆధారంగా.. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి చేతు ఎత్తకపోవడంతో తీర్మానం వీగిపోయినట్లుగా ప్రకటించాలని పండిత్ వినీత వర్గీయులు కోర్టుతో పాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. పూర్వాపరాలు పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లేనని ప్రకటించింది. అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించిన ఆర్డీవోకు స్పష్టత లేని కారణంగా గందరగోళ పరిస్థితి నెలకొన్నందున ఆర్డీవో వినోద్‌కుమార్‌ను వివరణ కోరాల్సిందిగా కలెక్టర్‌కు సీడీఎంఏ సూచినట్లు సమాచారం.

**పట్టణంలో సంబురాలు**

ఆర్మూర్‌టౌన్: చైర్‌పర్సన్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ప్రకటన రావడంతో ఆమె వర్గీయులు పట్టణంలో సంబురాలు జరుపుకున్నారు. అంబేడ్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, మామిడిపల్లి, పెర్కిట్ చౌరస్తాలో పటాకులు కాల్చారు.

**రాకేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలకు షాక్...**

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, తాజా బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఇద్దరికీ పండిత్ వినీత వర్గం షాక్ ఇచ్చినట్లుగా అయ్యింది. వీరిద్దరూ చైర్ పర్సన్ వినీతను గద్దె దింపడం కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ అధికార పార్టీ అండతో తిరిగి చైర్ పర్సన్ పీఠాన్ని దక్కించుకున్న తీరు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# అక్కడలా.. ఇక్కడిలా..

- సింగిల్ విండోలలో ఎరువుల ధరలలో వ్యత్యాసాలు
- ముత్యంపేటలోకన్నా జంగంపల్లిలో బస్తాపై రూ. 50 అదనం
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు
- వేతనాల కోసమే ఎమ్మార్పీకి అమ్ముతున్నామన్న సీఈవో

భిక్కనూరు: జంగంపల్లి సింగిల్ విండోలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సమీపంలోని సహకార సంఘంలోకన్నా ఎక్కువ ధరకు ఎరువుల బస్తాను విక్రయిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ, ముత్యంపేట సింగిల్ విండోల్లో 20:20:13 ఎరువు బస్తాను రూ. 1,150కి విక్రయిస్తున్నారు. అదే ఎరువుల బస్తాను జంగంపల్లి సింగిల్ విండోలో రూ. 1,200లకు అమ్ముతున్నారు. శనివారం పలువురు రైతులు ఈ విషయమై సీఈవో రమేశ్‌ను నిలదీశారు. తమ వేతనాల విషయంలో సింగిల్‌విండోపై అధిక భారం పడుతున్నందున తక్కువకు ఇవ్వడం లేదని, ఎమ్మార్పీకే అందిస్తున్నామని సీఈవో సమాధానమిచ్చారు. ఈ విషయమై రైతులు విండో చైర్మన్ సిద్దరాములుతో మాట్లాడగా.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయిస్తున్నామన్నారు. అయితే ఎరువులపై బస్తాకు రూ. 50 ఎక్కువ తీసుకుంటున్నట్లుగానే వడ్లను కూడా అధిక ధరకు ఎందుకు కొనుగోలు చేయడం లేదని రైతులు ప్రశ్నించారు. తీసుకున్న ధరకు రసీదు కూడా ఇస్తున్నామని, ఏం చేస్తారో చేసుకోండని విండో చైర్మన్ కటువుగా సమాధానమిచ్చారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితిలో బస్తాకు రూ. 1,200 చెల్లించి ఎరువులు కొనుగోలు చేశారు.


ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

### నేడు గురుకుల కళాశాలల ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా(సీవోఈ) కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం కోసం ఆదివారం కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని గురుకులాల ఆర్‌సీవో అలివేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, తాడ్కోల్, కొయ్యగుట్ట/తక్కడపల్లి, పెద్దకొడప్‌గల్, కామారెడ్డి డిగ్రీ కళాశాల, పెద్ద ఎక్లార, బాన్సువాడ/బోర్లాంలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

# జహీరాబాద్‌లో బీజేపీ జెండా ఎగరేద్దాం

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

బాన్సువాడ: పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకోసం పార్టీ కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శనివారం బాన్సువాడ, బీర్కూర్‌లలో బీజేపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా సుమారు 70 రోజుల సమయం ఉందన్నారు. ప్రతి కార్యకర్త తమ బూత్ స్థాయిలో భారీ మెజారిటీ కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యకర్తల కష్టాన్ని పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి బద్దం మహీపాల్‌రెడ్డి, బాన్సువాడ అసెంబ్లీ కోకన్వీనర్ భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శంకర్‌గౌడ్, కోనాల గంగారెడ్డి, చీకట్ల రాజు, సాయిబాబా, భాస్కర్‌రెడ్డి, సాయికిరణ్, గంగారాం, దత్తు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. శుక్రవారం నాటికి 2లక్షల50వేల 845 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

### స.హ.చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ వసతిగృహాల్లో స.హ.చట్టం బోర్డులను ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సభ్యులు ఇంతియాజ్, లింగమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వార్డెన్ శారద తదితరులున్నారు.

### గ్రామాల్లో వైద్యశిబిరాలు

నస్రుల్లాబాద్/బిచ్కుంద: మండల నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఆలన పాలియేటివ్ కేర్ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అంకుష్, ఎంఎల్‌హెచ్‌పీ జావదుద్దీన్, ఏఎన్‌ఎం వెంకట లక్ష్మి, కార్యకర్తలు ఉన్నారు. బిచ్కుందలోని ఖద్‌గాంలో శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉమాకాంత్ పరీక్షలు చేశారు.

### డిగ్రీ ఫలితాలు విడుదల



బిచ్కుంద(జుక్కల్):మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ ఫలితాలను శనివారం తెయూ పరీక్షల నియంత్రణ అధికారి సీవోఈ ప్రొఫెసర్ అరుణ, ఏసీవో శాంతాబాయి చేతుల మీదుగా విడుదల చేశారు. కళాశాలలో విద్యార్థులు 57.45 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ చంద్రముఖిని అభినందించారు.

### డ్రెయినేజీ పనులు ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని 13వ వార్డులో శనివారం కాంగ్రెస్ నాయకులు మల్లికార్జునప్ప శెట్కార్, కమల్ కిషోర్ సీసీ డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. మురికి కాలువల్లేక ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు పేర్కొనగా డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు అవార్ సురేష్, నా యకులు విఠల్‌రెడ్డి, గంగాధర్, నాషా నాయక్ ఉన్నారు.

### వాహనాల తనిఖీ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని ఏఎస్సై రాములు సూచించారు. శనివారం పోచారం చౌరస్తాలోని 161 జాతీయ రహదారి సమీపంలో తనిఖీలు చేశారు.

# దర్జాగా నొక్కేశారు..

- 20 మంది హెచ్‌ఎంల సొంత అకౌంట్‌లో రూ. 3.20 లక్షలు జమ
- రికవరీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు
- 15వ తేదీ వరకు గడువు విధింపు



నిజామాబాద్ అర్బన్: విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల నగదును కొందరు హెచ్‌ఎంలు దర్జాగా నొక్కేశారు. పాఠశాల విద్యార్థులకు దుస్తులను కుట్టి ఇచ్చేందుకుగాను మంజూరయ్యే నిధులను ఏజెన్సీతో పాటు కొందరు హెచ్‌ఎంలు తమ సొంత అకౌంట్లో జమ చేసుకున్నారు. తీరా ఏడాది తర్వాత దుస్తులు లేకపోవడం నిధులు ఖర్చవడంపై ఉన్న అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో సీరియస్‌గా తీసుకున్న అధికారులు డబ్బులను రికవరీ చేయాలని ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖ ప్రస్తుతం గల్లంతైన రూ. మూడు లక్షలు రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**అసలేం జరిగిందంటే..**

జిల్లా వ్యాప్తంగా 1195 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2లక్షల50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 2022–23 ఏడాదికి గాను ఏకరూప దుస్తులను అందించేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే దుస్తులకు సంబంధించిన దుస్తులను సరఫరా చేసింది. స్థానికంగా విద్యార్థులకు దుస్తులను కుట్టి ఇచ్చేందుకు పలు ఏజెన్సీ ద్వారా అందించాలని ఆదేశించారు. ఇందులో ఒక్కో దుస్తుకు రూ. 50 చొప్పున కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా మెప్మా ఆధ్వర్యంలో దుస్తులు కుట్టి ఇవ్వాలని నాటి కలెక్టర్ ఆదేశించడంతో వారు బాధ్యత తీసుకున్నారు. వారు కార్తికేయ ఏజెన్సీ, ఫర్ఫెక్ట్ టైలర్, దేవేందర్ అనే ముగ్గురికి కుట్టిచ్చే బాధ్యతలను అప్పగించారు. ఇందులో కొందరు సకాలంలో దుస్తులను కుట్టించి ఇవ్వలేదు. దేవేందర్ అనే టైలర్ సకాలంలో దుస్తులు అందించకపోవడంతో చెల్లించిన దుస్తుల నగదు ఇవ్వాలని నాటి జిల్లా అధికారులు ఆదేశించడంతో నిధులు వెనక్కి ఇచ్చేశాడు. కానీ సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు మాత్రం ఆ నగదును తమ సొంత అకౌంట్లో జమ చేసుకున్నారు. సరిగ్గా ఏడాది తర్వాత సంబంధించిన దుస్తులు రాకపోవడం, లెక్కల్లో నిధులు చూపకపోవడాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో మొత్తం మంజూరైన నిధులు దుస్తుల వివరాలను పరిశీలించగా 20 మంది హెచ్‌ఎంలు దుస్తులను ఇవ్వకున్నా తమ అకౌంట్లో నగదు వేసుకున్నారు. మొత్తం రూ.3.20లక్షలు ప్రభుత్వ నిధులను ప్రధానోపాధ్యాయులు తమ అకౌంట్లో వేసుకున్నట్లు తేలింది. ఏడాది పొడవునా ఈ నిధులను తమ దగ్గరే ఉంచుకోవడం సరైంది కాదని తక్షణమే నిధులను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సంబంధించిన అకౌంట్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో కొందరు మొండికేయగా జిల్లా విద్యాశాఖ అధికారి తీవ్రంగా స్పందించి నోటీసులు జారీ చేస్తుండడంతో తిరిగి నిధులను జిల్లా విద్యాశాఖకు జమ చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకు గడువు విధించడంతో కొందరు నిధులు జమ చేస్తున్నరు. కానీ హెచ్‌ఎంలు ప్రభుత్వ నిధులను గుట్టుచప్పుడు కాకుండా తమ సొంత అకౌంట్‌లో జమ చేసుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**నగదును రికవరీ చేస్తున్నాం**

కొందరు హెచ్‌ఎంల అకౌంట్‌లో నిధులు ఉన్నట్లు గుర్తించి వాటిని ప్రస్తుతం రికవరీ చేస్తున్నాం. కొందరు హెచ్‌ఎంలు దుస్తులు, నిధులు ఇవ్వలేదు, వాటిని గుర్తించడం జరిగింది. నగదు చెల్లించని హెచ్‌ఎంలపై చర్యలు తప్పవు.

– శ్రీనివాస్‌రావు, సీఎంవో, జిల్లా విద్యాశాఖ

## సాంఘిక శాస్త్రంతో సులభంగా ఉద్యోగాలు

బాన్సువాడ : సాంఘిక శాస్త్రంలో ప్రావీణ్యం సాధిస్తే గ్రూప్స్‌లో సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చని గెజిటెడ్ హెచ్‌ఎం దుర్గాబాయి అన్నారు. శనివారం పట్టణంలోని కోనా బాన్సువాడ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆమె మాట్లాడుతూ సాంఘిక శాస్త్రం ఉన్నతమైన సబ్జెక్ట్ అని, గ్రూప్స్, సివిల్స్ చదివే వారికి సాంఘిక శాస్త్రం చాలా ఉపయోగమన్నారు. సాంఘికశాస్త్రంలో ప్రావీణ్యం పొందిన వారు సులభంగా ఉద్యోగాలు సాధిస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 230మంది విద్యార్థులు సోషల్ టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యారు. ప్రథమస్థానంలో రావణ్(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తుజాల్పూర్), ద్వితీయ స్థానంలో వర్షిక (జెడ్పీ ఉన్నత పాఠశాల హంగర్గ), తృతీయ స్థానం దీన (జెడ్పీహెచ్‌ఎస్ లింగంపల్లి), ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ స్థానం సంకీర్తన (జెడ్పీ ఉన్నత పాఠశాల తుజాల్పూర్), ద్వితీయ స్థానం అబ్దుల్ నజీర్ నబీన్ అహ్మద్(మోడల్ స్కూల్ గోపాల్‌పేట్), తృతీయ స్థానం ప్రణవి ( మోడల్ స్కూల్ సదాశివనగర్)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈనెల 10 జరిగే రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌కు ఈ విద్యార్థులు హాజరవుతారు. గాంధీ గ్లోబల్ ట్రస్ట్, తెలంగాణ సాంఘిక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రసూన్ కుమార్, ప్రధాన కార్యదర్శి నూతిపల్లి బాల్‌రాజ్, హెచ్‌ఎం హన్మాండ్లు, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.



సాంఘిక శాస్త్రం టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- రూ.3 లక్షలకు హైదరాబాద్‌లో విక్రయించిన కిడ్నాపర్ సోహైల్
- సీసీటీవీ ఆధారంగా కేసు విచారణ
- తల్లిదండ్రులకు అప్పగించిన డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ

ఖలీల్‌వాడి: నగరంలో బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ జయరాం మాట్లాడుతూ.. మాలపల్లికి చెందిన మహ్మద్ సల్మాన్ అలియాస్ మిరాజ్ అనే ఏడేళ్ల బాలుడు ఈ నెల 31న కిడ్నాప్‌నకు గురైనట్లు బాలుడి తండ్రి మహమ్మద్ అయాజ్ ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కిడ్నాప్ గురించి పోలీసులు విచారణ చేపట్టగా సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా కిడ్నాప్ చేసిన సోహైల్‌ను అదుపులోకి తీసుకున్నారు. సదరు కిడ్నాపర్ సోహైల్ బాలుడి ఇంటి పక్కనే ఉంటాడు. తరచూ బైక్‌పై తిప్పడంతోపాటు తినుబండరాలు కొనిచ్చేవాడు. ఎప్పటిలాగే సోహైల్ బాలుడిని బైక్‌పై తీసుకెళ్లి కిడ్నాప్ ముఠాకు చెందిన దంపతులు షేక్‌అబిద్, సబానాబేగంలకు అప్పగించాడు. అనంతరం వారు బాలుడిని కారులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ జరీనా, హలియాలకు బాలుడిని షేక్ అబిద్ అప్పగించగానే వారు ఫలక్‌నామాలోని ముస్తాఫా రోడ్డులోని ముఠాసభ్యులకు అప్పగించారు. ముఠాసభ్యులు కిడ్నాప్ చేసిన వారికి రూ.3 లక్షలు చెల్లించారు. ఇందులో సోహైల్‌కు రూ.70 వేలు, షేక్ అబిద్, సబానాబేగంలు రూ.1.70 లక్షలు తీసుకోగా, జరీనా, హాలియాలకు రూ. 10 వేలు ఇచ్చినట్లు తెలిపారు. మిగితా డబ్బు ఖర్చుల కోసం వినియోగించినట్లు చెప్పారు.

**సీసీటీవీల ఆధారంగా..**

సీసీటీవీ ఫుటేజీల ఆధారంగానే బాలుడిని కిడ్నాప్ చేసిన సోహైల్‌ను పట్టుకున్నట్లు డీసీపీ జయరాం తెలిపారు. కిడ్నాపర్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకొని తమదైనశైలిలో విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడిందన్నారు. బాలుడిని కిడ్నాప్ చేసే ముఠా సభ్యుల నుంచి విడిపించినట్లు చెప్పారు. బాలుడిని తల్లిదండ్రులు సాహిదాబేగం, మహమ్మద్ అయాజ్‌కు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్‌కుమార్ అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. పూర్తి వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్, ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై రమేశ్ ఉన్నారు.

### రైస్‌మిల్ నిర్మాణ స్థలం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



స్థలాన్ని పరిశీలిస్తున్న డీటీ వెంకటేశ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండలంలోని చిన్నదేమి శివారులోని సర్వే నం.48, 49 భూమిలో జరుగుతున్న పారాబాయిల్డ్ రైస్‌మిల్ నిర్మాణం స్థలాన్ని శనివారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ పరిశీలించారు. శనివారం 'సాక్షి'లో 'రైస్‌మిల్ నిర్మాణాన్ని నిలిపేయాలి' శీర్షికతో కథనం ప్రచురితం కాగా రెవెన్యూ అధికారులు స్పందించి నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు. ఇక్కడ బాయిల్డ్ రైస్‌మిల్ నిర్మాణం జరిగితే ఇబ్బందులను రైతుల ద్వారా తెలుసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని పంపిస్తామన్నారు. రైతులు రాఘవ రెడ్డి, మహేశ్, రాంరెడ్డి, రాజేందర్, రాంచందర్‌రావు తదితరులున్నారు.

### పిల్లికి పాలిచ్చిన పంది



బాల్కొండ: జాతి వైరం మరిచి పిల్లి ఆకలిని తీర్చింది ఓ పంది. శనివారం నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో పంది ఉండగా పిల్లి దాని వద్దకు వెళ్లి పాలు తాగడం... పంది కూడా తల్లి ప్రేమను చూపించడం అక్కడున్న వారు ఆసక్తిగా తిలకించారు.

### వరి నారు ఎత్తుకెళ్తున్న వ్యక్తికి దేహశుద్ధి



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి చౌరస్తా వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న నర్సరీ నుంచి కూరగాయల నారును అపహరించుకెళ్తున్న వ్యక్తిని రైతులు రెడుహ్యాండెడ్‌గా శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పట్టుకున్నారు. మండలంలోని ర్యాగట్లపల్లి, రామేశ్వర్‌పల్లి, గుర్జకుంట, భిక్కనూరు గ్రామాలకు చెందిన రైతులు ఈ నర్సరీలో నారును సాగు చేస్తున్నా రు. అయితే నెలరోజులుగా వరినారు చోరీకి గురవుతోంది. శనివారం రాత్రి ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన రైతులు నర్సరీ వద్ద కాపు కాశారు. దీన్ని గమనించని పర్వతాపూర్ గ్రామానికి చెందిన లంబాడి విఠల్ బైక్‌పై వచ్చి పక్కనే ఉన్న పంటపొలంలో టమాట,మిర్చి నారు చోరీ చేసి వెళ్తుండగా ర్యాగట్లపల్లి రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మాదక ద్రవ్యాల వినియోగంతో విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఐఎస్ఆర్‌డీ జిల్లా కన్వీనర్ రాజేందర్ రావు అన్నారు. శనివారం మండలంలోని పద్మాజివాడి ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణ, సామాజిక మాధ్యమాలతో ఎదురవుతున్న సమస్యలు మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇలాంటి వ్యసనాలకు అలవాటు పడొద్దన్నారు. సంస్థ ప్రతినిధులు రవళి, సంజీవ్, సంతోష్ తదితరులున్నారు.



### భవన నిర్మాణ కార్మికులకు పరిహారం పెంచాలి

బాన్సువాడ : భవన నిర్మాణ కార్మికులకు డెలీవరి, మ్యారేజ్, సహజ మరణానికి సంబంధించిన పరిహారం పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. శనివారం బాన్సువాడలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో దుబాస్‌రాములు, సుశీల, మేతరి గంగారం, భూమయ్య తదితరులున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దుబాస్‌రాములు, ఉపాధ్యక్షులుగా ధర్మ చిన్న సాయిలు, శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యిదర్శిగా శివాజీ, కార్యవర్గ సభ్యులుగా రేణుక, గోపాల్, నాగయ్య, గంగాధర్, శ్రీకాంత్, కమ్మరి రాములు తదితరులున్నారు.

### బాలికపై అత్యాచారం.?

- పోలీసుల అదుపులో నిందితుడు

బాన్సువాడ: పట్టణంలోని ఓ హోటల్‌లో బాలికపై ఓ వ్యక్తి అత్యాచారం చేయడంతో స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన బాలికను తీసుకెళ్లి పట్టణంలోని ఓ హోటల్‌లో అత్యాచారం చేస్తుండగా గమనించిన స్థానికులు సదరు వ్యక్తిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. బాలికను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సమాచారం. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.


## సాక్షి సండే క్లాసిఫైడ్స్




**EDUCATION**

■ One Sitting / Regular: 10th, Inter, NIOS, TOSS, APOSS, DEG, PG, Nagarjuna, SV, YVU, University, Guidelines for B.Tech failed students (KPHB) Ph: AES 9515390685, 9032284760 [H-801585]

**SERVICES**

**BUSINESS OFFER**

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

**ఓల్డేజ్ హోం**

■ సాయి హోంకేర్ & ఓల్డేజ్: వృద్ధులకు, పేషంట్లకు అన్ని రకముల సేవలకు 24 గం. అటెండర్స్‌ను పంపగలము. (ఆయాలు, అటెండర్స్ కావలెను జీ+భో+వ ఫ్రీ) ✆ 7569630177, 9398868009. [B-1206329]

**REAL ESTATE**

**PROPERTY FOR SALE**

■ బోధన్ టౌన్ నందు అంబేద్కర్ చౌరస్తాకు దగ్గర నెలకు 22 వేలు కిరాయిలు (బాయ్స్ హాస్టల్ & మెస్స్ పై 2.50 లక్షలు) సంపాదించే 110Sq. కమర్షియల్ ప్రాపర్టీ అమ్మబడును. Cell: 6281173731. [Z-1080530]

**PLOT FOR SALE**

■ మేడ్చల్ టౌన్‌లో, Creek ఇంటర్నేషనల్ School పక్కన, HMDA అప్రూవ్డ్ ప్లాట్స్ కలవు, Bank Loan సదుపాయం, స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. ✆ 93920 01367. [B-2832]

**WANTED**

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (tower-ac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1255218]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ 20k ఫోన్ 8977639662 / 8977639663. [H-793685]

■ బాలాజీ గ్రూప్ (A.P, T.S & న్యూఢిల్లీ నెం-1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5000/కమీషన్. 9133271122 / 9052671122. [H-787781]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-801571]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, లేడీ సూపర్‌వైజర్స్, ఆయాలు, భార్యాభర్తలు & గార్డెన్ వర్క్ అవ్వలను చూసుకొనుటకు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13030]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## క్రైం కార్నర్

### గోవూర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వర్ని(మోస్రా): మండలంలోని గోవూర్ శివారులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు వర్ని పోలీసులు శనివారం తెలిపారు. గ్రామ శివారులో మృతదేహం ఉందన్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు ర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలపారు.


### చికిత్స పొందుతూ యువకుడు..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన పటేల్ శ్రీనివాస్ (35) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం ముంబాయికి వలస వెళ్లి ఏడాది క్రితం కోటగిరికి వచ్చాడు. నాటి నుంచి ఏ పని చేయలేదు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై అప్పులు చేశాడు. శుక్రవారం పురుగుల మందు సేవించి కిందపడిపోయాడు. విషయం గ్రహించిన కుటుంబీకులు బోధన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చెరువులో మృతదేహం లభ్యం

ఎల్లారెడ్డి: మండల శివారులోని చెరువులో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేశ్ శనివారం పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని ఎర్రకుంట తండాకు చెందిన నీల శాంత (33) ఇంట్లో భర్తతో గొడవ పడి గత నెల 30న ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. శాంత తల్లి ఫిర్యాదు మేరకు ఈ నెల 2న పోలీసులు కేసు నమోదు చేశారు. ఎల్లారెడ్డి చెరువులో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతదేహం నీల శాంతగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### సైలెన్సర్లు ధ్వంసం



కామారెడ్డి క్రైం: భారీ శబ్దం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో తిరుగుతున్న వాహనాలపై పట్టణ పోలీసులు కొరడా ఝులిపించారు. బైక్‌లకు ఉండే సైలెన్సర్‌లను విడదీసి పట్టణ పీఎస్‌లో శనివారం రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజులుగా పట్టణ పరిధిలో చేపడుతున్న వాహనాల తనిఖీల్లో పెద్ద శబ్దంతో తిరుగుతున్న 26 బైక్‌లను గుర్తించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి పంచనామా నిర్వహించి రోడ్‌రోలర్‌తో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

డిచ్‌పల్లి/ లింగంపేట: కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం మోతె గ్రామానికి చెందిన మంగళి కాశీరాం (35) డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాశీరాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. దీంతో కుటుంబపోషణ భారంగా మారింది. మానసిక కుంగుబాటుకు గురై మతిస్థిమితం సరిగా లేకుండా పోయింది. కాశీరాం ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఒకరి బైక్ తీసుకుని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో కాశీరాం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని గమనించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

**జీవితంపై విరక్తితో మరొకరు..**

రుద్రూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోతంగల్ మండగల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొంతల శ్రీను(35) కూలీ పనులు చేస్తు జీవిస్తుంటాడు. గతంలో భార్యతో గొడవలు కావడంతో విడాకులు తీసుకున్నాడు. తల్లి పోశవ్వతో ఉంటున్న శ్రీను కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం తల్లి కళ్యాపూర్‌లో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీను జీవితంపై విరక్తితో శుక్రవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**భిక్కనూరులో మద్యానికి బానిసై..**

ఎల్లారెడ్డి: మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భిక్కనూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి మోహన్(24) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి దుర్గవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఒకరు మృతి



భాస్కర్ (ఫైల్)

మోపాల్: మండలంలోని కంజర శివారులో టిప్పర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన గుడి భాస్కర్(43) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం భాస్కర్ పొలం పనులు ముగించుకొని కంజర వైపు వస్తుండగా అదే సమయంలో టిప్పర్ కంజర నుంచి ముల్లంగి వైపు వెళ్తోంది. కంజర శివారులో టిప్పర్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో భాస్కర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది ప్రథమ చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి భార్య కవిత గతంలోనే చనిపోయింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు.

### సాతెల్లిలో ఒకరిపై దాడి

ఎల్లారెడ్డిరూరల్: వ్యవసాయ భూమి విషయంలో చిన్నాన్నపై అన్న కొడుకు దాడి చేసిన ఘటన మండలంలోని సాతెల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసగళ్ల సదానందంపై అతడి అన్న కొడుకు ప్రవీణ్ గొడ్డలితో వ్యవసాయ భూమి విషయంలో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ సదానందంను కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

### ఒకరి అదృశ్యం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పెద్ద దేవీసింగ్ తండాకు చెందిన భాముస్ దేవీలాల్ అదృశ్యమైనట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. గత నెల 11న ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో సైతం అదృశ్యం కాగా వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### పోలీసులు విచారిస్తారనే భయంతో..



సాయిలు(ఫైల్)

గాంధారి: మండలంలోని మాతు సంగెం గ్రామానికి చెందిన నీరడిసాయిలు(46) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలు కామారెడ్డిలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గతంలో గుర్జాల్ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబానికి సాయిలుకు మధ్య గొడవలు జరిగాయి. కులపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి రాజీ కుదిర్చారు. ఈ క్రమంలో సదరు మహిళ కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో మహిళ భర్త గాంధారి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ విషయం సాయిలుకు తెలియడంతో పోలీసులు తనను ప్రశ్నిస్తారేమోనని భయంతో శనివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### బెదిరింపుల కేసులో ముగ్గురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: భూమిని కబ్జా చేసేందుకు యత్నించి, రిటైర్డ్ తహసీల్దార్‌ను బెదిరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన రిటైర్డ్ తహసీల్దార్ పోశెట్టి 1989లో మున్సిపల్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో ఉండే సర్వే నంబర్ 206లో 262 గజాల ప్లాటును కొనుగోలు చేశాడు. ప్లాటు ఖాళీగా ఉండటంతో దానిపై కన్నేసిన విద్యానగర్‌కు చెందిన శంకరయ్య, శివకుమార్, సంతోష్‌లు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించుకునేందుకు పథకం వేశారని డీఎస్పీ తెలిపారు. గతంలో వేసి ఉంచిన ఫెన్సింగ్‌ను కూల్చేయడంతో పాటు, కొద్ది రోజుల క్రితం మరోసారి ఫెన్సింగ్ వేస్తుండగా దౌర్జన్యానికి దిగినట్లు వెల్లడించారు. రిటైర్డ్ తహసీల్దార్‌ను కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించారని పేర్కొన్నారు. పోశెట్టి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ యాక్ట్‌తో పాటు పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిపై గతంలోనూ పలు కేసులు ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.